నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 2 సెప్టెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

నేడు విద్యా సంస్థలకు సెలవు

- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు : కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ హనుమంత్ కె. జెండగే ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలెవరూ అత్యవసర పనులు ఉంటేనే తప్ప బయటకు రావద్దని సూచించారు. జిల్లాలో సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిందని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లొద్దని చెప్పారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే మండల స్థాయిలో స్థానిక తాసీల్దార్‌ను, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ 08685 293312 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వర్ష బీభత్సం

పోటెత్తిన వరద.. ఉప్పొంగిన వాగులు, చెరువులు

- పలుచోట్ల చెరువులకు గండ్లు.. ఇండ్లలోకి చేరిన నీరు
- విరిగిన పడిన చెట్లు.. నేలకూలిన విద్యుత్ స్తంభాలు
- లక్షలాది ఎకరాల్లో మునిగిన పంట పొలాలు
- కోదాడలో వరదకు కొట్టుకుపోయి ఇద్దరు మృతి
- నడిగూడెంలో సాగర్ ఎడమ కాల్వకు, పిల్లలమర్రిలో మూసీ కాల్వకు గండి
- భారీ వర్షాలపై మంత్రుల ఆరా.. అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు

అతలాకుతలమైన సూర్యాపేట జిల్లా

కోదాడ, హుజూర్‌నగర్‌లో 30 సెంటీమీటర్ల వర్షపాతం

నీట మునిగిన కోదాడ షిరిడీ సాయినగర్ కాలనీ

హుజూర్‌నగర్‌లో 15వ వార్డులో ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. శనివారం మొదలైన వాన ఆదివారం కూడా కొనసాగింది. సూర్యాపేట జిల్లాలో కురిసిన అతి భారీ వర్షపాతం అతలాకుతలం చేసింది. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో 30 సెంటీ మీటర్లు, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో 14 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో ఎక్కడ చూసినా పోటెత్తున్న వరద దృశ్యాలే కనిపిస్తున్నాయి. భారీ వర్షానికి వాగులు, చెరువులు ఉప్పొంగుతున్నాయి. పలుచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. ఇండ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అక్కడక్కడ ఇండ్లు కూలాయి. చెట్లు విరిగి పడగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వరదతో లక్షలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. వరద ధాటికి రోడ్లు కోతకు గురయ్యాయి. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

– సూర్యాపేట, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ)

వలికొండ : సంగెం గొల్లెపల్లి గ్రామాల మధ్య భీమలింగం కత్వా వద్ద లోలెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న మూసీ నది

వర్షం పోయినా పోటెత్తిన వరద

వర్షం తగ్గినా వరద పోటెత్తడంతో సూర్యాపేట జిల్లాలో దాదాపు 18 గంటలపాటు జన జీవనం స్తంభించింది. పలు కాలనీలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కోదాడలో వరద ఉధృతిలో కొట్టుకుపోయిన కారులో నాగం రవి(36), బైక్ కొట్టుకుపోయి ఎరమల్ల వెంకటేశ్వర్లు(56) మృతి చెందారు. పట్టణాల్లో సెల్లార్లు, గ్రౌండ్ ఫ్లోర్లలోకి నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి తడిసిపోవడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. రహదారులపై నీళ్లు ప్రవహించాయి. అన్ని శాఖలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు కలెక్టర్ లత జిల్లా వ్యాప్తంగా పర్యటించి సహాయక చర్యలను పరిశీలించారు.

పంటలకు తీవ్ర నష్టం

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి సూర్యాపేట జిల్లాలో పెద్ద ఎత్తున పంటలు నీట మునిగాయి. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలతోపాటు కోదాడ పరిధిలోని మోతె, మునగాల, నడిగూడెం, హుజూర్‌నగర్ పరిధిలోని మేళ్లచెర్వు, పాలకవీడు, మఠంపల్లి ప్రాంతాల్లో వేసిన పత్తి, పెసర, వరి పంటలు నీట మునిగాయి. వరద ప్రవాహంతో పంట పొలాల్లో మట్టి మేటలు పేరుకుపోయాయి. సాగర్ ఆయకట్టు అయిన కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఇటీవల నాట్లు వేస్తుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా వర్ష బీభత్సం, వరదల నేపథ్యంలో పరిస్థితిని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరా తీశారు. సోమవారం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో వర్షంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో ఆయన పర్యటించనున్నారు.

సాగర్, మూసీ కాల్వలకు గండ్లు

వరద పోటెత్తడంతో కోదాడ నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం సమీపంలో నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు గండి పడింది. దాంతో రామచంద్రాపురం గ్రామంలోకి నీళ్లు చేరడంతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. పంటలు నీటమునిగాయి. సూర్యాపేట మండలం పిల్లలమర్రి సమీపంలో మూసీ ఎడమ కాల్వకు గండి పడింది. దీంతో పంట పొలాలు నీట మునిగాయి. మూసీ అధికారులు వెంటనే ఇసుక బస్తాలు వేసి గండిని పూడ్చారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఎన్ఎస్‌పీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన గండిని పూడ్చే ప్రక్రియను ప్రారంభించారు.

భారీ వర్షాలపై మంత్రి కోమటిరెడ్డి ఆరా

నీలగిరి : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితులపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం ఆరా తీశారు. జిల్లాలోని తాజా వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు కలెక్టర్‌తో సమాచారం తెప్పించుకొని సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఏ ఒక్కరూ కూడా విధులకు గైర్హాజరు కాకుండా చూసుకోవాలని కలెక్టర్ నారాయణ రెడ్డిని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఆలేరు రూరల్ : కొలనుపాకలో ఉధృతంగా ప్రవహిస్తున్న పితాంబరం వాగు

భువనగిరిలో రోడ్డు పై విరిగిపడిన చెట్టు

వదలని వాన

యాదాద్రి జిల్లాలో రెండో రోజూ దంచికొట్టిన వర్షం

- రెడ్ అలెర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ
- రహదారులు జలమయం.. తేలిన గుంతలు
- రోడ్లపై విరిగిపడిన చెట్లు.. వాహనదారుల ఇబ్బందులు
- ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది
- జిల్లా ఆస్పత్రిలోకి చేరిన వర్షం నీరు
- అడ్డగూడూరులో 19.6 సెంటీమీటర్ల వర్షపాతం

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో కూడిన వానలు దంచికొడుతున్నాయి. ఆదివారం రెండో రోజు కూడా ముసురు వదల్లేదు. రాత్రి నుంచి నాన్‌స్టాప్‌గానే వర్షం కురుస్తూనే ఉంది. దీంతో వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించింది. జిల్లాలో రెండు రోజులుగా సూర్యుడు కనిపించడమే గగనమైంది. సాయంత్రం తర్వాత జర్రంత గరువించింది. ఆకాశం మేఘావృతమై, మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. భారీ వర్షాలతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అత్యవసరమైతే తప్ప జనాలు ఇంటికే పరిమితమయ్యారు. ఇక పలు మండలాల్లో చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. కరెంట్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతున్నాయి.

అత్యధికంగా 19.6 సెంటీమీటర్ల వర్షపాతం

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి. అడ్డగూడూరులో అత్యధికంగా 19.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పోచంపల్లిలో 17, బీబీనగర్, మోత్కూరులో 10, రామన్నపేట, ఆత్మకూరు (ఎం)లో 9.8, నారాయణపురంలో 9.3, చౌటుప్పల్‌లో 9.2, బొమ్మలరామారంలో 9.1, ఆలేరులో 8.1, వలిగొండ, తుర్కపల్లిలో 8, భువనగిరిలో 7.9, రాజాపేటలో 7.8, మోటకొండూరులో 7 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లాలో సోమవారం కూడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ..

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో మూసీ ప్రవాహం పెరిగింది. జిల్లా మీదుగా వెళ్తున్న మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లి వద్ద ఉధృతి పెరుగడంతో పరిస్థితిని స్థానిక అధికారులతో కలిసి కుంభం అనిల్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వలిగొండ మండలంలోని భీమలింగం కత్వ వద్ద సంగెం–గొల్లెపల్లి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తున్నది. రెవెన్యూ అధికారులు రెండు వైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

జిల్లాలో వర్ష ప్రభావం ఇలా..

- భారీ వానలతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి జనరల్ వార్డులోకి వర్షం నీరు చేరింది. కిటీకీల నుంచి నీరు రావడంతో బెడ్లు తడిసిపోయాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శానిటరీ సిబ్బంది వరద నీటిని తొలగించారు.
- భువనగిరి మాస్ కుంటకు వెళ్లేదారిలో చెట్టు విరిగి రోడ్డుపై పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.
- ఆత్మకూరు మండల వ్యాప్తంగా వాగులు ప్రవహిస్తున్నాయి. ప్రధాన రోడ్లపై చెట్లు విరిగిపడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి.
- ఆలేరు మండలంలోని కొలనుపాకలో పీతాంబరం వాగు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నది.
- రాజాపేట మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతున్నది.
- మోటకొండూరు మండలంలోని కొండాపూర్, ఆత్మకూర్ (ఎం) మండలంలోని కాల్వపల్లి మధ్యలో నుంచి ప్రవహిస్తున్న బిక్కేరు వాగు ను కలెక్టర్ హన్మంతు కె.జెండగే పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు.
- యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం వాగులోకి వరద నీరు రావడంతో చెక్‌డ్యాంపై మత్తడి దుంకుతున్నది. యాదగిరిగుట్ట పట్టణంలో మురికి కాల్వలు ఉప్పొంగడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బాలికల హాస్టల్‌లో చెట్టు విరిగి పడింది.
- భువనగిరి మండలం అనాజిపురం–భువనగిరి మధ్య ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా చెట్టుకు విరిగి పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొద్ది సేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది.
- వరంగల్ జిల్లా కేసముద్రం, మహబూబాబాద్ వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో భువనగిరి మండలం పగిడిపల్లి రైల్వే స్టేషన్ నుంచి నడికుడి రైల్వే లైన్ గుంటూరుకు దారి మళ్లించారు.
- రామన్నపేట మండలకేంద్రంలోని ఓ ఇంటిపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. వెల్లంకి–సుంకేనపల్లి రోడ్డుకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో రాకపోలకు ఇబ్బంది వాటిల్లింది.

వర్షపాతం వివరాలు ఇలా..

మండలం	వర్షపాతం (సెం.మీ.)
అడ్డగూడూరు	19.6
పోచంపల్లి	17
బీబీనగర్	10
మోత్కూరు	10
రామన్నపేట	9.8
ఆత్మకూరు (ఎం)	9.8
నారాయణపురం	9.3
చౌటుప్పల్	9.2
బొమ్మలరామారం	9.1
ఆలేరు	8.1
వలిగొండ	8
తుర్కపల్లి	8
భువనగిరి	7.9
రాజాపేట	7.8
మోటకొండూరు	7

కిటికీల నుంచి ఎలుకలు వస్తున్నాయి

- హాస్టల్‌లో ఫ్యాన్లు పని చేయక ఇబ్బంది పడ్డాం
- కరెంట్ పోతే దోమల బాధ
- మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల బృందానికి సమస్యలు తెలిపిన విద్యార్థులు
- కొండ భీమనపల్లి బీసీ గురుకుల పాఠశాల సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

దేవరకొండ రూరల్, సెప్టెంబర్1 : మండలంలోని కొండ భీమనపల్లి శివారులో ఉన్న బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఆదివారం బీఆర్ఎస్ మాజీ మంత్రులు, సిద్దిపేట, సూర్యాపేట ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. గత నెల 26న గురుకులంలో విద్యార్థులపై ఎలుకల దాడి ఘటన రాష్ట్రంలో కలకలం రేపింది. సంఘటన జరిగిన మరుసటిరోజు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఇదే విషయమై గాయపడిన 13మంది విద్యార్థులను ఆదివారం మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పరామర్శించారు. అక్కడ నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్లు లేకపోవడం వల్ల కిటికీలు తీయడంతో అందులో నుంచి ఎలుకలు వస్తున్నాయని, నిద్రిస్తున్న సమయంలో దాడి చేస్తున్నాయని విద్యార్థులు వారికి తెలిపారు. బాత్‌రూం డోర్లు సరిగా లేకపోవడం, దోమ తెరలు లేకపోవటం వల్ల ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. కరెంట్ పోయినప్పుడు జనరేటర్ లేకపోవడం వల్ల చీకట్లో అవస్థలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రగ్గులు, ట్రాక్ సూట్, స్పోర్ట్స్ డ్రెస్సులు అందించలేదని, భోజనం నాణ్యత లేదని విద్యార్థులు తమ గోడు వినిపించారు. ఇంకా పలు సమస్యలతో సతమతమతున్నామని విద్యార్థులు నాయకులతో చెప్పి వాపోయారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని తమ ఆరోగ్యాలను కాపాడాలని వారి ముందు కోరారు. ప్రభుత్వం గురుకులాలను పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించామని తెలిపారు. బీసీ గురుకుల పాఠశాల చుట్టూ చెట్లు, పొదలు ఉన్నందున పాములు, తేళ్లు వచ్చే అవకాశం ఉందని, యాంటీవీనమ్ ఇంజెక్షన్ కూడా దగ్గర ఉండకపోవడం నిర్లక్ష్యాన్ని చూపుతుందని, ఇది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్‌రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రేగట్టె మల్లికార్జున్, టీవీఎన్‌రెడ్డి, పల్లా ప్రవీన్‌రెడ్డి, చింతపల్లి సుభాశ్, గాజుల రాజేశ్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తే అద్భుత ఫలితాలు

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 1 : గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తే అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి మండలం జూలూరులో ఆదివారం రాష్ట్ర, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతంలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యూత్ బాలికలు, బాలురు, సీనియర్ విభాగంలో పురుషులు, మహిళలు వెయిట్ లిఫ్టింగ్‌లో పాల్గొని ప్రతిభను చాటారు. యూత్ ఉమెన్ బెస్ట్ లిఫ్టర్‌గా సహస్ర , యూత్ మెన్ బెస్ట్ లిఫ్టర్‌గా బాలకృష్ణ , జూనియర్ మెన్‌గా డి.గణేశ్ గోల్డ్ మెడల్ సాధించారు . 200 మంది క్రీడాకారులు పాల్గొనగా 90 మందికి వివిధ కేటగిరీలో బహుమతులు అందజేశారు. 55 మందికి గోల్డ్ మెడల్స్, 40 మందికి సిల్వర్ మెడల్స్, 38 మందికి బ్రాంచ్ మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు ముకిరి శృతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుస్పాల వెంకటరమణ , యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కాసుల భానుచందర్, జిల్లా నాగరాజు, ప్రధాన కార్యదర్శి సందీప్, నాయకులు పాక మల్లేశ్‌యాదవ్, తడక వెంకటేశం, సామ మధుసూదన్ రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, భారత లవ కుమార్, కాసుల అంజయ్య, బండారు ప్రకాశ్‌రెడ్డి, ఫకీరు మల్లారెడ్డి, కీర్తి సంజీవ, బుడ్డ యాదగిరి, భోగ నరసింహ పాల్గొన్నారు .

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

ముగిసిన అంతర్జాతీయ టెన్నిస్ టోర్నీ

- సింగిల్స్, డబుల్స్ విజేతలకు పతకాలు అందజేత

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పట్టణ శివారులోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో కొనసాగుతున్న ఐటీఎఫ్ అండర్ – 18 అంతర్జాతీయ టెన్నిస్ టోర్నీ ముగిసింది. ఆదివారం బాల బాలికల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ ఫైనల్ మ్యాచ్ లు జరిగాయి. సింగిల్స్ బాలికల విభాగంలో స్నిగ్ధ కాంత(ఇండియా).. సోహిని సంజయ్ మోహంతి (ఇండియా)పై విజయం సాధించింది బాలికల డబుల్స్ లో దియా రమేశ్, సోహిని సంజయ్ మెహందీ (ఇండియా) జంట.. అస్మి అడ్కర్, ఐశ్వర్య జాదవ్(ఇండియా)పై 4–6,6–1,11–9 సెట్లతో గెలుపొందింది. సింగిల్స్ బాలుర విభాగంలో శంకర్ హిస్నమ్ (ఇండియా).. సెహజ్ సింగ్ (పై) 7–5,6–3 సెట్లతో విజయం సాధించాడు. సెహజ్ సింగ్ రన్నరప్ గా నిలిచాడు. డబుల్స్ విభాగంలో సెహజ్ సింగ్, వరుణ్ (ఇండియా) జంట.. వెంకట్ రిషి (అమెరికా), కందవేల్ మహాలింగం (ఇండియా)పై 7–6,6–2 సెట్లతో విజయం సాధించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు ఎన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, న్యూ డైమెన్షన్ అకాడమీ ఎండీ సుభాశ్‌రెడ్డి, ఐటీఎఫ్ సూపర్‌వైజర్ శివ కుమార్ రెడ్డి పతకాలను అందజేశారు.

విజేతలతో నిర్వాహకులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

మోటకొండూర్ మండలంలోని కొండాపూర్ బిక్కేరు వాగును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే

అడ్డగూడూరు/మోటకొండూర్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం, చిర్రగూడూరు గ్రామాల మధ్య వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. వరద ప్రవాహం తగ్గే వరకు రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించారు. కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. అలాగే మోటకొండూర్ మండలంలోని కొండాపూర్‌లో బిక్కేరు వాగును కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ శాంతిలాల్, ఆర్ఐ నరేశ్, పంచాయతీ కార్యదర్శి కోటేశ్, పోలీస్ కానిస్టేబుల్‌లు జాన్‌రెడ్డి, మధు ఉన్నారు.